క్లుప్తంగా

చేపూర్ సర్పంచ్‌కు దళిత రత్న అవార్డు

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం చేపూర్ గ్రామ సర్పంచ్ ఇందూర్ సాయన్న దళిత రత్న అవార్డును అందుకున్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ భవన్‌లో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, అర్బన్ ఎమ్మెల్యే గణేశ్ గుప్తా చేతుల మీదుగా సర్పంచి సాయన్నకు దళిత రత్న ఆవార్డును అందజేశారు.

కాంగ్రెస్ పార్టీ ఎన్రోలర్స్‌కు నగదు బహుమతి

రుద్రూర్: కోటగిరి ఉమ్మడి మండలంలోని ఎత్తొండ, యాద్గార్‌పూర్, దోమలేడిగి, హంగర్గ గ్రామాల్లో తొమ్మిది మంది కాంగ్రెస్ పార్టీ ఎన్రోలర్స్‌కి చందూర్ జెడ్పీటీసీ అంబర్‌సింగ్ నగదు బహుమతి అందజేశారు. ఒక్కొక్కరికి రూ. 5 వేల చొప్పున రూ.45 వేలు అందచేశారు. చందూర్ వైస్ ఎంపీపీ దశ గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పోతరాజు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

బాడీ ఫ్రీజర్ అందజేత



ఎడపల్లి(బోధన్): వడ్డేపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు దాతలు గ్రామ పంచాయతీ కార్యాలయానికి బుధవారం ఒక బాడీ ఫ్రీజర్‌ను అందించారు. సర్పంచ్ కూరెళ్ల శ్రీధర్ మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన మూడ్ గోవింద్, కురెళ్ల శకుంతల కుటుంబ సభ్యులు మూడ్ తుకారాం, కోలా హరిలాల్, కురెళ్ల కిష్టయ్యల జ్ఞాపకార్థం రూ.60 వేల విలువైన బాడీ ఫ్రీజర్‌ను అందజేయడం ఎంతో అభినందనీయమన్నారు. పంచాయితీ కార్యదర్శి గంగాధర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు



రుద్రూర్: సులేమాన్‌నగర్‌కి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఎంపీటీసీ గౌస్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి పార్టీ కండువా వేసి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మానాల మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. కొత్తగా పార్టీలో చేరుతున్న వారిని సమన్వయం చేసుకుని సమిష్టిగా పని చేయాలని సూచించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇందూర్ చంద్రశేఖర్, మండల అధ్యక్షుడు తోట అరుణ్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రుణాలు సద్వినియోగం చేసుకోవాలి



భీమ్‌గల్: ఐకేపీ ద్వారా మహిళలకు ఇచ్చే రుణాలను అందరూ సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని జెడ్పీటీసీ చౌట్‌పల్లి రవి ఆకాంక్షించారు. మండలంలోని పురాణిపేట్‌లో ఐకేపీ గ్రామ సమాఖ్య జనరల్ బాడీ మీటింగ్ బుధవారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిదిగా జెడ్పీటీసీ చౌట్‌పల్లి రవి హాజరై మాట్లాడారు. అనంతరం ప్రభుత్వం ద్వారా వచ్చిన రూ.17 లక్షల వడ్డీ రాయితీ చెక్కును సంఘ సభ్యులకు అందజేశారు. సర్పంచ్ తోట శంకర్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నర్సయ్య,స్త్రీనిధి మేనేజర్ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న జీపీ కార్మికుల సమ్మె



ఆర్మూర్ టౌన్/ఎడపల్లి/రుద్రూర్ : జిల్లా వ్యాప్తంగా జీపీ కార్మికుల సమ్మె కొనసాగుతోంది. బుధవారం జీపీ కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆర్మూర్, ఎడపల్లి, రుద్రూర్ మండలాల్లో ఆందోళనలు చేశారు. వీరికి వివిధ పార్టీల నేతలు సంఘీభావం తెలిపి మాట్లాడారు. జీవో–60 ప్రకారం వేతనాలు చెల్లించాలని, మల్టీ పర్పస్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కోటగిరిలో జీపీ కార్మికులు భిక్షాటన చేసి నిరసన తెలిపారు. అలాగే ఎడపల్లి అర్ధనగ్న ప్రదర్శన చేశారు.

అభివృద్ధి చేసేవాళ్లను కడుపులో పెట్టుకోవాలి

- మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి

బాల్కొండ: అభివృద్ధి చేసేవాళ్లను కడుపులో పెట్టుకోవాలని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం మెండోరా మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గతంలో మెండోరా మండలంలోని రైతులు కాకతీయ కాలువ లీకేజీ నీళ్ల కోసం తనపై కోపం చూపించారన్నారు. కాని ప్రస్తుతం కాకతీయ కాలువలో లీకేజీ నీరు కాదు, సాగు నీరు కూడ ఢోకా లేకుండా రివర్స్ పంపింగ్ ద్వారా కాళేశ్వరం నీళ్లను తీసుకువచ్చి పోచంపాడ్ ప్రాజెక్ట్‌లో వేసిన అపూర్వ ఘట్టం కూడా పూర్తయిందన్నారు. ఇప్పటికైన తనపై ప్రేమ చూపాలన్నారు. మంచి చేసినా, చెడు చేసినా ఒకే విధంగా ఉంటే ఎలా అంటూ ఆవేదన వ్యక్త చేశారు. ఎస్సారెస్పీ నిండితే అధికంగా లాభ పడేది మెండోరా మండల కేంద్ర వాసులే అన్నారు. ఎంపీపీ సుకన్య, జెడ్పీటీసీ తలారి గంగాధర్, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.



పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి ప్రశాంత్ రెడ్డి

కులవృత్తుల్ని ఆదుకున్నది కేసీఆరే

బోధన్‌టౌన్(బోధన్): తెలంగాణలో కులవృత్తులు అంతరించిపో పోతున్న తరుణంలో వారికి అండగా నిలిచి ఆదుకున్న ఘనత సీఎం కేసీఆర్‌దేనని అయేషా వెల్ఫేర్ ట్రస్ట్ చైర్ పర్సన్, ఎమ్మెల్యే సతీమణి అయేషా ఫాతిమా అన్నారు. బుధవారం పట్టణంలోని విశ్వకర్మ సంఘ భవనంలో విశ్వబ్రాహ్మణ, కమ్మరి, వడ్రంగి కులాల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో ద్విచక్ర వాహనాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన ఎమ్మెల్యే సతీమణి మాట్లాడారు. నియోజకవర్గంలోని కులవృత్తుల కులాల వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించేలా చర్యలు చేపడుతామని పేర్కొన్నారు. బోధన్ పట్టణ కమ్మరి వడ్రంగి సంఘం పట్టణ అధ్యక్షులు వడ్ల సతీష్‌చారి, వడ్ల సూర్యకాంత్‌చారీ, వడ్ల భోజేందర్ చారీ, వడ్ల లాలయ్య చారి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సతీమణి అయేషా

విద్యా సంస్థల బంద్ విజయవంతం

బోధన్/ఆర్మూర్ టౌన్ : విద్యా రంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ విద్యార్థి, వామపక్ష సంఘాల నాయకులు మంగళవారం ఇచ్చిన బంద్ విజయవంతమైంది. అన్ని పాఠశాలలు, కళాశాలలు మంగళవారం సెలవు ప్రకటించిన సంగతి తెల్సిందే.బుధవారం విద్యార్థులు, నాయకులు రోడ్డుపై బైఠాయించి వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ప్రభుత్వం ప్రైవేటు, కార్పొరేటు విద్యా సంస్థలను ప్రోత్సహిస్తూ ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేస్తోందని వారు ఆరోపించారు.



నిరసన తెలుపుతున్న యూఎస్‌ఎఫ్ఐ నేతలు

కాంగ్రెస్ 9 గంటల కరెంటు ఇచ్చింది

ఎడపల్లి(బోధన్): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు రైతులకు 9 గంటల ఉచిత కరెంటు నిరంతరంగా ఇచ్చిందని కాంగ్రెస్ పార్టీ నేత కెప్టెన్ కరుణాకర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఎడపల్లి కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత రూ.16 వేల కోట్ల మిగులు బడ్జెట్, మిగులు విద్యుత్ ఉండేదన్నారు. 2014లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 24 గంటలు ఉచిత కరెంటు ఇస్తామని చెప్పి 5– 6 గంటల కరెంటు ఇచ్చారన్నారు. రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను వక్రీకరించారని అన్నారు. నేతలు శంకర్ నాయుడు, భాస్కర్‌రాజు, ఫయాజుద్దీన్, లొల్లి పార్వయ్య, సున్నపు ఒడ్డెన్న, గణపురం రవి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కెప్టెన్ కరుణాకర్‌రెడ్డి

రైతాంగానికి క్షమాపణ చెప్పాలి



బోధన్ మండలం రాజన్న చౌరస్తాలో రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

- రేవంత్ వ్యాఖ్యలపై బీఆర్‌ఎస్ ఆందోళన
- సబ్‌స్టేషన్ల వద్ద దిష్టిబొమ్మల దహనం

సాక్షి నెట్‌వర్క్ : వ్యవసాయానికి 3 గంటల విద్యుత్ సరిపోతుందని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ బీఆర్‌ఎస్ నాయకులు బుధవారం బోధన్, ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాల్లో ఆయన దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నేతలు మాట్లాడుతూ.. రైతులకు 24 గంటల విద్యుత్ అవసరం లేదని, కేవలం 3 గంటలు ఇస్తే సరిపోతుందని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించడం సిగ్గుచేటని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి రైతు వ్యతిరేకి అని విమర్శించారు. వెంటనే ఆయనను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే రైతాంగానికి వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఉచిత కరెంటు ఇస్తుంటే కాంగ్రెస్ నాయకులకు కళ్లు మండుతున్నాయని అన్నారు.



ముప్కాల్ మండల కేంద్రంలో..



వర్నిలో ..



రుద్రూర్‌లో ..



బోధన్ పట్టణం అంబేడ్కర్ చౌరస్తాలో..



నవీపేటలో..



వేల్పూర్ మండలం జాన్కంపేట్‌లో..

రైతు వ్యతిరేక విధానాలకు పరాకాష్ట

రుద్రూర్: వ్యవసాయానికి మూడు గంటల కరెంట్ ఇస్తామని చెప్పడం, ధరణి రద్దు చేస్తామనడం కాంగ్రెస్ పార్టీ రైతు వ్యతిరేక విధానాలకు పరాకాష్ట అని బాన్సువాడ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి పోచారం సురేందర్ రెడ్డి అన్నారు. రుద్రూర్ మండల కేంద్రంలో బుధవారం ఆయన మాట్లాడారు. ప్రతిపక్ష నాయకులు రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై విషం కక్కుతున్నారని, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న పార్టీలను తరిమి కొట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉండాలని అన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పత్తి లక్ష్మణ్, జెడ్పీటీసీ నరోజి గంగారాం, రైతుబంధు అధ్యక్షుడు తోట సంగయ్య, విండో చైర్మన్ సంజీవరెడ్డి, తదితరులున్నారు.



మాట్లాడుతున్న పోచారం సురేందర్ రెడ్డి

కొనసాగుతున్న దీక్షలు

రెంజల్(బోధన్): బండల్ల రోడ్డు నిర్మాణ పనులను చేపట్టి సమస్యను పరిష్కరించాలని రెంజల్ గ్రామ రైతులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. కుల సంఘాల ఆధ్వర్యంలో దీక్షలను చేపడుతున్నారు. గురువారం 15వ రోజుకు దీక్షలు చేరుకున్నాయి. ముదిరాజ్ కుల సంఘాల సభ్యులు దీక్షల్లో కూర్చున్నారు.

సమాచారం..

దరఖాస్తుల ఆహ్వానం

భీమ్‌గల్: స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో కోప, ట్రేడ్ కోర్సుల్లో రెండో విడత సీట్ల భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్ రావ్ బుధవారం తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులై, 14 సంవత్సరాలపై బడిన వారు https://iti.telangana.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

ఇంటి వద్దకు ఆర్టీసీ సేవలు



బస్‌పాస్ అందజేస్తున్న శంకర్

రుద్రూర్: గ్రామీణ ప్రాంత ప్రజలకు ఆర్టీసీ సేవలు అందించేందుకు సిబ్బంది ఎంతో కృషి చేస్తున్నారు. రుద్రూర్ మండల కేంద్రానికి చెందిన సాయి కృష్ణ అనే దివ్యాంగుడు బస్ పాస్ పొందే అర్హత ఉన్నప్పటికి కౌంటర్ వద్దకు వెళ్లడానికి ఇబ్బంది పడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న విలేజ్ బస్ ఆఫీసర్ శంకర్ బుధవారం దివ్యాంగుడి సర్టిఫికెట్లు సేకరించి ఇంటికెళ్లి పీహెచ్‌సీ బస్సుపాస్ కార్డును అందచేయడంతో స్థానికులు అభినందించారు.

మిగులు విద్యుత్ లెక్కలు ఏవి



మోర్తాడ్ సబ్ స్టేషన్ వద్ద దిష్టిబొమ్మ దహనం

మోర్తాడ్(బాల్కొండ): తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్‌ను ఇస్తున్నామని చెప్పి బడ్జెట్‌లో నిధులు కేటాయించినా వాస్తవానికి 12 గంటలే విద్యుత్ సరఫరా చేస్తున్నారని మిగులు విద్యుత్ లెక్కలు ఏవి అని తెలంగాణ కాంగ్రెస్ అధికార ప్రతినిధి వేణుగోపాల్ యాదవ్ ప్రశ్నించారు. ఉచిత విద్యుత్ విషయంలో తెలంగాణ ప్రభుత్వం రైతులను మసిపూసి మారేడు కాయ చేస్తుందని ఆయన ఆరోపించారు. బుధవారం మోర్తాడ్‌లోని సబ్ స్టేషన్ ఎదుట ఆందోళన కార్యక్రమం నిర్వహించి వేణుగోపాల్ యాదవ్ మాట్లాడారు. రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను వక్రీకరించారని ఆరోపించారు.

బీఆర్‌ఎస్‌ది విష ప్రచారం

- రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను వక్రీకరించారు
- పార్టీ పిలుపు మేరకు జిల్లా వ్యాప్తంగా సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మల దహనం



వేల్పూర్‌లో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం..



ముప్కాల్ మండల కేంద్రంలో..



వర్ని సబ్ స్టేషన్ వద్ద..



మోస్రా మండల కేంద్రంలో..



దొంకేశ్వర్ విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట ..

సాక్షి నెట్‌వర్క్ : బీఆర్‌ఎస్ ప్రభుత్వం కాంగ్రెస్, రేవంత్ రెడ్డిపై విష ప్రచారం చేస్తోందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు బుధవారం జిల్లా వ్యాప్తంగా విద్యుత్ సబ్ స్టేషన్ల ఎదుట సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మలను దహనం చేసి నిరసన తెలిపారు. కొన్ని చోట్ల రాస్తారోకోలు, ధర్నాలు చేశారు. అనంతరం నేతలు మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం అధికారంలో ఉన్న తొమ్మిదేళ్లలో ఏనాడు కూడా 24 గంటల ఉచిత విద్యుత్తు సరఫరా చేయలేదని ఆరోపించారు. ఉచిత విద్యుత్తులో ఉన్న అవినీతిని రేవంత్‌రెడ్డి వెల్లడించినందుకే ఆయన మాటలు వక్రీకరించి, కాంగ్రెస్‌పై బురద చల్లుతున్నారని ఆరోపించారు. మొదటగా ఉచిత కరెంట్ ఇచ్చింది కాంగ్రెస్ పార్టీయేనని, ఆనాడు వైఎస్‌ఆర్ తొలి సంతకం చేసింది కూడా కరెంటుపైనేనని గుర్తు చేశారు. రైతులకు రూ.12 వేల కోట్ల విద్యుత్ బకాయిలను మాఫీ చేసిన ఘనత కాంగ్రెస్‌కు ఉంటే, బీఆర్‌ఎస్ సర్కారు విద్యుత్ సంస్థలకు రూ.60 వేల కోట్లు బకాయి పెట్టిన విషయం వాస్తవం కాదా అని ఎద్దేవా చేశారు. అనంతరం రైతులకు నాణ్యమైన ఉచిత విద్యుత్ ఇవ్వాలని కోరుతూ విద్యుత్ శాఖ అధికారులకు వినతి పత్రాలు అందజేశారు.



సాలూరలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



కమ్మర్‌పల్లిలో..



రెంజల్ సబ్‌స్టేషన్ ఎదుట..



భీమ్‌గల్‌లో రాస్తారోకో చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



నందిపేటలో ..



కోటగిరిలో ..

వైభవంగా బోనాల పండుగ



బోధన్/బాల్కొండ: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని బుధవారం బోధన్ పట్టణ కేంద్రంలోని విజయ సాయి హైస్కూల్‌లో , బాల్కొండ మండల కేంద్రంలోని కృష్ణవేణి పాఠశాలలో బోనాల పండుగను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. మహిళా ఉపాధ్యాయులు బోనాలు ఎత్తుకొని ఆలయానికి వెళ్లారు. విద్యార్థులు బోనాలతో ఊరేగింపు నిర్వహించారు.

తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 – ఇన్‌సీడియోస్ - (తెలుగు) - 10.10, 04.10, 10.10; మిషన్ ఇంపాజిబుల్ (ఇంగ్లీష్)-12.40 6.40
స్క్రీన్-2 – సామజవరగమన(తెలుగు)-10.00 1.00 4.00 7.00 10.00
స్క్రీన్-3 – రంగబలి(తెలుగు) 10.40, 1.35 7.25 10.20, స్పై(తెలుగు)-4.30
స్క్రీన్-4 – =స్క్రీన్-4= మిషన్ ఇంపాజిబుల్ (తెలుగు)-11.00, 2.30, 6.00 9.30

సంక్షిప్తం

కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

బాల్కొండ: ముప్కాల్ మండల పరిధిలో పలు గ్రామాల లబ్ధిదారులకు మంజూరైన కల్యాణ లక్ష్మి చెక్కులను బుధవారం తహసీల్ కార్యాలయంలో ఎంపీపీ సామ పద్మ, జెడ్పీటీసీ బద్దం నర్సవ్వ పంపిణీ చేశారు. తహసీల్దార్ శ్రీకాంత్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రైతులకు పసుపు మొక్కలు..

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి పసుపు పరిశోధన స్థానంలో వివిధ రకాలతో ముందస్తుగా పెంచిన పసుపు మొక్కలను బుధవారం రైతులకు పంపిణీ చేశారు. నిర్మల్ జిల్లా ఖానాపూర్, జగ్రాన్‌పల్లి మండలం, జగిత్యాల జిల్లా తదితర ప్రాంతాల నుంచి రైతులు వచ్చి తీసుకెళ్లారు.

ఇళ్ల స్థలాలు..

నవీపేట: కోస్లీ, లింగాపూర్ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలను మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సంగెం శ్రీనివాస్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ వీర్‌సింగ్, కోస్లీ, లింగాపూర్ గ్రామాల సర్పంచులు నీలేశ్ కుమార్, బత్తూర్ సాయిలు, బీఆర్‌ఎస్ నాయకులు బుచ్చన్న, శ్రీధర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజు ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ దరఖాస్తుల స్వీకరణ

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో 18 నుంచి 35 ఏళ్లు నిండిన వారికి ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ అందించనున్నారు. 2వ రోజు సైతం బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో డ్రైవింగ్ లైసెన్స్ దరఖాస్తులను బీఆర్‌ఎస్ నాయకులు స్వీకరించారు. బీఆర్‌ఎస్ నేత పూజ నరేందర్ పాల్గొన్నారు.

మొక్కలు నాటిన హైవే అధికారులు

బాల్కొండ: బాల్కొండ, ముప్కాల్ మండల కేంద్రాల్లో జాతీయ రహదారి–44 బైపాస్ పక్కన, డివైడర్ మధ్యలో నేషనల్ హైవే అథారిటీ అధికారులు బుధవారం మొక్కలను నాటారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటినట్లు ప్రాజెక్ట్ మేనేజర్ ప్రణయ్ చందర్ తెలిపారు. పీఆర్‌వో స్వామీ, సేఫ్టీ ఇంజినీర్ అవినాష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్ కడుపు నింపుకోడానికే రోడ్డు పనులు



మాట్లాడుతున్న బీజేపీ నేత మల్లికార్జున్‌రెడ్డి

బాల్కొండ: కాంట్రాక్టర్ కడుపు నింపుకోడానికి, కమీషన్లు నొక్కేందుకే ముప్కాల్ మండల కేంద్రంలో రోడ్డు వెడల్పు పనులను చేపడుతున్నారని బీజే పీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం రోడ్డు వెడల్పు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రోడ్డు వెడల్పు పనుల్లో ఎలాంటి ప్రమాణాలు పాటించకుండా ఇష్టా రీతిలో పనులు చేపడుతున్నారని మండిపడ్డారు. రోడ్డు హద్దులు ఏర్పాటు చేయకుండానే డివైడర్ కట్టడం నిబంధనలకు విరుద్ధమన్నారు. మంత్రి ప్రశాంత్‌రెడ్డి తన బంధువు కాంట్రాక్టర్ కడుపు నింపటానికే అడ్డగోలుగా పనులు చేపడుతున్నారని విమర్శించారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు నిమ్మల శ్రీనివాస్, నాయకులు ముస్కు నర్సయ్య, గడ్డం సంతోష్, గంగా సాయన్న, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.